# న్యాయం కోసం

ఎన్నికలు.

ఎన్ని కలలు!

ఎన్నికలపై ఎన్ని కలలు!!

ఎన్నికల కల... ల... లలా...

లలలా... లాయరుగారివేళ వస్తానన్నారు. వస్తానన్న రోజున ఆయన తప్పకుండా వస్తారు. నా పోరాటం కోసం ఆయనకెంత ఆరాటం! పోరాటం మొదలై రోజులా, నెలలా, సంవత్సరాలా? పన్నెండు సంవత్సరాలు! పన్నెండేళ్ళనుంచీ న్యాయంకోసం-

కమలాదేవి ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది.

ఆమె కళ్ళముందు ఎర్ర జెండాల రెపరెపలు. ఎత్తండి ఎత్తండి ఎర్ర జెండా... ఎగరాలి ఎగరాలి ఆకాశం నిండా... అరుణ కాంతులు... ఆ కాంతులన్నీ భ్రాంతులయితే... ఏవి తల్లీ నాడు కురిసిన హిమసమూహములు?!

- పదిహేనేళ్ళ కమల పెద్ద గొంతుతో, ఆవేశంతో పాడుతోంది. ఆమె ముందు స్టేజిమీద జెండాలు, జెండాలు, ఎర్రెర్రని జెండాలు. కమల పాటకు కరతాళధ్వనులు.

"కమలమ్మ తల్లీ. ఎంత బాగా పాడేవమ్మా (నీ పాటకు వేల ఓట్లు, కాదు కాదు లక్షల ఓట్లు పడడం ఖాయం)" కమల భుజం తడుతూ రామలింగం.

ఆమె ముఖంలో ఆనందపు వెలుగులు, రామలింగం గెలిచినప్పుడు ఇంకెన్నో హరివిల్లులు. కమలలోనే కాదు, ఎందరిలోనో.

ఓట్లు కురిపించి రామలింగాన్ని ముఖ్యమంత్రిని చేసిన ఎర్రజెండా ధగధగలు చూసి కమల గుండెలో పూసిన గర్వం.

ఇక ఆకలుండదు. అనారోగ్యం వుండదు. నిరుద్యోగం వుండదు. నిరక్షరాస్యత వుండదు.

నవ్వుల రాజ్యంలో పువ్వుల తోటలు. పువ్వుల తోటల్లో నవ్వుల పాటలు- అనుకుంటూ వేదిక ఎక్కి ఉద్వేగంతో అభ్యుదయ గీతాలు ఆలపిస్తూ తిరిగిన

కమలకు ఇరవై ఏళ్ళొచ్చాయి. బి.ఎ పరీక్ష రాసింది.

అంతలో మళ్ళీ ఎన్నికలొచ్చాయి. కమలకు క్షణం తీరికలేదు. ఎక్కేవేదిక, దిగేవేదిక, విరామ మెరుగని శ్రుతి, లయ తప్పని కమల రాగాలాపన, ఎర్రజెండాలు ఎత్తుగా గుంపుగా వరసల్లో. ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. మీ ఓటు మా జెండాకే. రామలింగానికి వేసే మీ ఓటు సోషలిజానికి చేటు.

మళ్ళీ ఎర్రజెండాకే ఓట్లు. మళ్ళీ రామలింగానికే ముఖ్యమంత్రి పదవి. ఈసారి ఆయన దర్శనమే దూరదర్శనం!

రామలింగం పదవీ వ్యాపారం మొదలెట్టాడు. అధికార జులుంతో ఆస్తుల పోగేత ప్రారంభించాడు. లింగాల్ని కూడా మింగగల స్థాయికి చేరుకున్నాడు. కొడుకు పేర పెద్ద ఎత్తున బ్రెడ్‌ల కర్మాగారం స్థాపించాడు. కూతురి పేర ఇంకేదో పరిశ్రమ నెలకొల్పాడు. ఇలాగే ఎన్నో...

కమల ఉద్యోగ ప్రయత్నాలు మొదలెట్టింది. ఆమెకు నిరుద్యోగ రక్కసి వికటాట్టహాసం వినిపించింది. ఆకలి కరాళ నృత్యం కనిపించింది.

బాధల రాజ్యంలో ఎండిన తోటలు కనిపించాయి. ఎండిన తోటల్లో ఏడ్పుల పాటలు వినిపించాయి.

ఇరవై మూడేళ్ళొచ్చిన కమలకు అంతా విచిత్రంగా తోచింది. మారుతుందనుకున్నా మారని బతుకుకు కారణమేమిటో తెలియలేదు.

"అన్నయ్యా, ఇలా జరిగిందేమిటి"

సుందరం నవ్వేడు.

కమల విసుక్కుంది.

"ఓటుకూ, ప్రామిసరీ నోటుకూ
నిలిచి నడిచేవు చెల్లీ
ఎవరికీ ఒరిగేది ఏమీ లేదని
ఎప్పటికి ఎరిగేవు చిట్టితల్లీ"

సుందరం వరసావాయీ లేని పాట...

కమల కళ్ళు తెరిచింది.

ఆమె కళ్ళల్లో నీళ్ళు-

అన్నయ్యా ఎక్కడున్నావు?

అసలున్నావా?

అన్నయ్య గొంతు బాగో పోయినా

"చెల్లీ, చిట్టితల్లీ" అన్నప్పుడు ఎంత మార్దవం! అది తన మీద ప్రేమతోనా? అలాగనే అప్పట్లో అనుకుంది. కానీ, అది ఏకోదర ప్రేమతో కాదు. దారితప్పిన వాళ్ళ పట్ల ఏర్పడే సానుభూతి వల్లనే ఆ మార్దవం, అంతేనా? అంతేనని కొంత కాలానికి తనకనిపించింది.

అనిపించిందంతా కనిపించకపోవచ్చు. కనిపించిందంతా నిజం కాక పోవచ్చు. ఈ 'వచ్చు' పెద్ద 'రొచ్చు' సుమా. ఈ 'సుమా'లు కూడా ఒకోసారి ఈసురో మంటాయి.

ఈశ్వర్రావు!

"ఏమ్మా, సుందరం మీ అన్నయ్య కదూ? ఏ వూరెళ్ళాడు?"

'తెలీదండి'

"మీ అన్నయ్య గురించి నీకు తెలీదంటావు. నన్ను నమ్మమంటావు. తెలిసిందంతా చెప్పెయ్యమ్మా. నిజం చెబితే నీకూ, నీ అన్నయ్యకూ కూడా మంచిది"

"నిజమండీ, నాకు తెలీదు. మేం కూడా మా అన్నయ్య ఎప్పుడొస్తాడా అని ఎదురు చూస్తున్నాం"

"ఆహా, అలాగనా! ఈవిడెవరు? చూసిన మొహంలా వుంది. మీ అన్నయ్య కేమవుతుంది?'

"సులోచన అని...నా ఫ్రెండ్"

"ఏమ్మా, సులోచనా, సుందరం నీకు తెలుసుకదూ"

"ఆ. మేం కలిసి చదువుకున్నాం"

"సుందరం ఎక్కడున్నాడో నువ్వన్నా చెప్పమ్మా"

"నాకు తెలీదండీ"

"నిజంగా తెలీదా"

"నిజంగా తెలీదండి"

"అయితే, కమలతోపాటు నువ్వూ జీపెక్కు. మీరిద్దరూ పోలీస్టేషన్లోనే సుందరం గురించి చెబుదురుగాని"

గిర్రున తిరిగే కన్నీళ్ళతో

"పోలీస్ స్టేషన్ కెందుకండీ"

"నోరుమూసుకుని ముందు జీపెక్కు"

హడలిపోయారిద్దరూ.

ఈశ్వర్రావు! ఎస్.ఐ. ఈశ్వర్రావు. ఇప్పుడు సి.ఐ.ఈశ్వర్రావు!

తెలియంది తెలుసునని చెప్పాలి(ట). తెలియంది - మర్యాదగా అడిగినప్పుడు చెప్పకపోతే, అమర్యాదగా అడిగినప్పుడైనా చెప్పాల్ట. అప్పుడూ చెప్పకపోతే, అమానుషంగా అడిగినప్పుడు చెప్పక చస్తారా అని ఈశ్వర్రావు ఆలోచన, ప్రయత్నం. ప్రయత్నమేనా? కుటిల ప్రయత్నం.

"మా అన్నయ్య ఏం చేసేడండీ"

"ఓహోహో... హహ్హహ... ఎంత అమాయకత్వం నటిస్తున్నావ్ కమ్లా ... మా అన్నయ్య ఏం చేసేడండీ అని నువ్వడుగుతున్నావు. అడుగుతావు తల్లీ. నేన్నీ కలా కనిపిస్తున్నానన్నమాట. అందుకే మా ప్రభుత్వాన్ని కూలదోయడానికి మీ అన్నగాడు కుట్ర పన్నాడు. అందులో మీకూ భాగముంది కనకనే మీరు సుందరం గురించి ఎంతడిగినా చెప్పడంలేదు. మీతో నిజం ఎలా చెప్పించాలో నాకు తెలుసు"

సన్నగావుండే ఈశ్వర్రావు గొంతు ఖంగుమంది. ఇప్పుడు లావుగావున్నా అతని గొంతు ఖంగుమంటూనే వుండొచ్చు.

ఈ 'వచ్చు' పెద్ద రొచ్చు.........

రొచ్చు, ఆ చీకటి కొట్టంతా రొచ్చే. చెమ్మలో చెమ్మగిల్లిన కళ్ళు. దుర్వాసనలో నిర్వీర్యమయ్యే ఒళ్ళు, ఆ గదిలో చీకటిలో .... ఆ చీకటి గదిలో.... నా మదిలో వ్యధలో...నా వ్యధ మదిలో...

బాధల మర్రిఊడలు, శోకాల ముళ్ళకంపలు.

బొజ్జింకలా ఆ చీకటి కొట్లో కొట్టుమిట్టాడుతూ... దుర్గంధం భరిస్తూ... అక్కడే తింటూ, అక్కడే... ఛీఛీ.... అన్నీ అక్కడే. నిద్ర, నిద్రేనా అది... ఆకలికీ, వేదనకీ, గ్లానికీ సొమ్మసిల్లి పోవడం నిద్రేనా?!

ఖాకీ దెబ్బలకు, కనిపించని పోట్లకు - కడుపులో పేగులు పాముల్లా విషపుకాట్లేస్తూ... నరాలు ముళ్ళ తీగల్లా శరీరాన్ని చీల్చుతూ... నలిగిపోతూ... మెలితిరిగిపోతూ... 'దేవుడా' అనే మాట రాబోతుంటే బలవంతంగా ఆపుకుని 'అమ్మా,అమ్మా' అని మూలుగుతూ... నిమిషాలా, గంటాలా, రోజులా, నెలలా, సంవత్సరాలా.... మూడు సంవత్సరాలు! అన్ని సంప్రదాయాలకూ, అన్ని చట్టాలకూ, మానవులంతా మన్నించే

అన్ని మర్యాదలకూ అతీతంగా రాక్షసంగా.

నాకు తెలియంది నేనెలా చెప్పగలను?

చెప్పగలవు, చెప్పిస్తానంటాడు ఈశ్వర్రావు.

తన చేతులు వెనక్కి విరిచి తాళ్ళతో కట్టేశాడు. దూలానికి తన జడను కట్టి, వదిలేసి "ఇప్పుడు చెప్పు అన్నాడు. తలంతా నొప్పి. గింజుకోబోతే తల చర్మం చిట్లుతూ మంట. కన్నీళ్ళు. ఆపుకుందామన్నా ఆగని ఏడుపు. బయటకు వినిపించని అరుపులు.

"హహ్హహహ్హహ. ఇప్పుడు చెబుతావు, సుందరం ఎక్కడున్నాడో, చెబుతానంటే నిన్ను కిందకు దింపుతాను. చెబుతావా?"

తెలియంది ఎలా చెప్పగలన్రా ఈశ్వర్రావూ అనుకుంది. తన తలను గోడకేసి బాదినప్పుడూ బాధతో గిలగిలలాడుతూ అలాగే అనుకుంది. ఒకవేళ తెలిస్తే మాత్రం నీకెందుకు చెప్పాల్రా శనీశ్వర్రావూ అనీ అనుకుంది.

ఇక తనకు చావు ఖాయమనే అనుకుంది. అయినా బతికింది.

నెల్లాళ్ళ తర్వాత మళ్ళీ మొదలు. రెణ్నెళ్ళ వ్యవధిచ్చి మళ్ళీ వేధింపు. ఆర్నెల్లకొకసారి, మూణ్నెల్లకొకసారీ రకరకాల వేధింపులు.

ఎలా భరించగలిగింది తను? ఎలా బతగ్గలిగిందింతకాలం?!

బతకడమేనా ఇది? సుఖపడడమే బతుకయితే ఇది బతకడం కాదు.

కానీ, తను బతికేవుంది. న్యాయం కోసం పోరాడుతోంది కాబట్టి తను బతికేవుంది- అన్నయ్య బతికే వుండివుంటాడా? పోరాటమే బతుకనేవాడు కాబట్టి బతికే వుంటాడు....

కమల తల విదిలించింది.

ఆగవా ఈ ఆలోచనలు ?

సులోచన ఇప్పుడెక్కడుందో? సులోచనను వెంటనే వదిలేశారు. తను జైలు నుంచి విడుదలయ్యాక సులోచన ఇంటికి వెళ్ళింది. సులోచన,

"సారీ, కమలా, ఇంకెప్పుడూ మా ఇంటికి రాకు. మా ఇంట్లో కూడా ఎవరికీ ఇష్టంలేదు" నిష్కర్షగా చెప్పేసింది.

తర్వాత, పెళ్ళి చేసుకుని ఏ వూరో వెళ్ళిపోయింది. మళ్ళీ కనిపించలేదు.

కనిపించకపోయినా ఆమె ఎక్కడో వుందికదా. అలాగే అన్నయ్యా ఎక్కడో వుండేవుంటాడు.

అలా అనుకుంటే కమలకెంతో హాయిగా వుంది. ఆరుబయట వెన్నెల్లో పడుకున్నట్టుంది.

పడక... తేళ్ళు కుట్టినట్టుగా సూదుల గుంటలతో చేతివేళ్ళు... ముక్కుతూ, మూలుగుతూ, చలికి వణుకుతూ నేల మీద పడక. మొదటి నెలరోజులూ అదే చీర. మాసిపోయి దుమ్ముకొట్టుకుంటూ, కంపుకొడుతూ చిరుగులతో అదే చీర. ఒకటే చీదర. స్నానం లేదు. రకరకాల రోగాలు. ఓ కాలికి పక్షవాతం. అప్పుడప్పుడూ స్పృహ కోల్పోవడం.

మూడేళ్ళపాటు హింసించి, హింసకు కృశించి, నశించిపోతున్న దేహాన్ని అవసానదశ దాకా పీడించి, అప్పుడు వదిలేశారు.

తనలో కసి, నిష్కారణంగా ఎలాంటి వారెంటూ లేకుండా తనను అరెస్టు చేసిన ఈశ్వర్రావుపై పీకలదాకా కసి. మూడేళ్ళనుభవించిన హింసలో, పీడనలో మొలకెత్తిన కసి.

చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దగ్గరకెళ్ళింది. అంతా చెప్పుకుంది. తన పక్షాన వాదించడానికి న్యాయవాది ప్రకాశం ముందుకొచ్చాడు.

అరెస్టుచేసిన వ్యక్తిని చట్టం ప్రకారం ఇరవైనాలుగ్గంటల్లోగా మేజిస్ట్రేట్ ముందుంచాలట. అలాంటిది.....

కసి నుంచి ఎగసిన స్థైర్యంతో ఈశ్వర్రావు మీద తన పోరాటం మొదలయ్యింది.

ఇక వాదనలు, ఈశ్వర్రావు అబద్ధపు రికార్డులు. ఓ కోర్టులో అతను ఓడితే, మరో కోర్టులో తను. నెలలకు నెలలు, ఏళ్ళకు ఏళ్ళు వాయిదాలు, వాయిదాలు.

తనకో ఇల్లుంది కాబట్టి, అందులో ఓ పోర్షన్ అద్దెకిచ్చి, ప్రైవేట్లు చెప్పుకుంటూ, ఫీజుకోసం ఆశించకుండా వాదించే ప్రకాశంగారి అండతో తన పోరాటం కొనసాగుతోంది.

ఈ మాత్రం అవకాశాలు లేని వాళ్ళెందరు అబద్ధపు కుట్రకేసుల చట్రాల కింద అణగారిపోతున్నారో....

అణచివేత... ఎన్ని రకాలో... తన కేసును అణగదొక్కడానికి ఈశ్వర్రావు ఎన్ని ప్రయత్నాలు చేశాడనీ....... కేసును ఉపసంహరించుకుంటే మంచి ఉద్యోగం ఇప్పిస్తానని బేరం పెట్టాడు. తను లొంగలేదు. "ప్రాణంమీద ఆశవుంటే, నేను చెప్పినట్టు చెయ్యి" అంటూ బెదిరించాడు. తను భయపడలేదు.

మండే మనసు శక్తి వాడికేం తెలుసు. రాటుతేలిన దేహానికీ, బండబారిన

హృదయానికీ భయం తెలయదని అతను తెలుసుకోలేకపోయాడు.

లాయరుగా ప్రకాశంగారికి పేరు ప్రఖ్యాతులుండడంతో ఆయన్ని ఏం చెయ్యలేక పత్రికల ద్వారా తన గొంతు నొక్కేయాలని చూశాడు. ఆ ప్రయత్నం అతన్ని ఎదురుదెబ్బ తీసింది. తన ఇంటర్వ్యూలు కూడా పత్రికల్లో రావడంతో ప్రజలకు తను పడ్డ చిత్రహింసలు తెలిశాయి.

"ఈ ప్రభుత్వాన్ని నమ్మనిదానివి ఈ ప్రభుత్వ చట్టాలను ఎందుకు నమ్ముతున్నావు? ఈ కోర్టుల్ని ఎందుకు ఉపయోగించుకుంటున్నావు?" అంటూ కొందరు తనను అడిగారు.

"ఉన్న కాసింత అవకాశాన్నీ ప్రజల్లో ఒకరిగా నేను ఉపయోగించుకుంటే తప్పేమిటి? అన్యాయాన్ని ఏదోరకంగా ఎదిరించవద్దా" అంది తను.

- జర్ర్ర్ర్ర్......

కమల గబుక్కున లేచింది. గోడను పట్టుకుని నెమ్మదిగా నడిచి, గుమ్మం దగ్గరకెళ్ళి, తలుపు తీసింది.

"నమస్తే సార్"

'నమస్తే. ఒంట్లో బావుంటోందా అమ్మా'

"ఆ, ఇలా కూర్చోండి"

"రేపు మన కేసుమీద తీర్పు ఇస్తారు. ఈశ్వర్రావును సస్పెండ్ చేయడ తథ్యం. ఎంత శిక్షపడుతుందో చూడాలి. ఉదయం పదిగంటలకల్లా నువ్వక్కడుండాలి."

"అలాగేనండీ. ఎవర్నన్నా తోడు తీసుకుని పది లోపులోనే కోర్టుకొచ్చేస్తాను."

కమల కళ్ళముందు పోరాట కమలాఫలాలు.

"ఎలాగూ నాకిదే దారికదా. నే వెళ్లేటప్పుడు నిన్ను పికప్ చేసుకుంటాను. నువ్వు రెడీగా వుండు. అన్నట్టు, ఇవేళ్టి పేపర్లో నీ కవితొచ్చింది. పేపరింకా నేను చదవలేదు. తిరగేస్తుంటే నీ కవిత కనిపించింది".

ప్రకాశం చేతిలోంచి పేపరు అందుకుంది కమల.

"వస్తానమ్మా. రేపు కలుసుకుందాం" వెళ్తున్న ప్రకాశంవంక కృతజ్ఞతతో చూసింది. అలా కొద్ది సేపున్న తర్వాత, తలుపేసి, తన కవితను చదువుకుంది. పేజీలు తిరగేస్తుంటే 'తీవ్రవాదుల తోక కత్తిరిస్తాం' అనే శీర్షిక కనపడింది. ఆ వార్తలో డి.జి.పి. విలేకర్లతో చెప్పిన విషయాలున్నాయి.

....... వర్గంలో కె.సి. సుందరం ప్రముఖపాత్ర వహిస్తున్నాడు. భూమిలేని నిరుపేద గిరిజనుల్ని, వ్యవసాయ కార్మికుల్ని సంఘటిత పరుస్తూ వారికి నాయకత్వం వహిస్తున్నాడు.

కమల మళ్ళీ మళ్ళీ చదివింది.

కె.సి. సుందరం! అన్నయ్య!!

బతికేవున్నాడు!!!

కమలకు కొండంత ధైర్యం వచ్చింది.

-సుదరం బతికున్నందుకేకాదు, తన నమ్మకం వమ్ముకానందుకు కూడా.

*(ప్రజాసాహితి మాసపత్రిక, ఆగస్టు 1989)*

*(పశ్చిమబెంగాల్‌లో అర్చనా గుహ న్యాయపోరాటం గురించి ఇలస్ట్రేటెడ్ వీక్లీలో చదివేక)*